క్లుప్తంగా

ప్రమాదానికి గురైన ఎమ్మెల్యే కాన్వాయ్‌లోని వాహనం

గన్నవరం: గన్నవరం శాసనసభ్యుడు డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ ప్రయాణిస్తున్న కాన్వాయ్‌లోని ఒక వాహనం ప్రమాదానికి గురైన సంఘటన తెలంగాణలోని సూర్యాపేట జిల్లా ఖాసీంపేట వద్ద శనివారం జరిగింది. వివరాలిలా వున్నాయి. శనివారం ఉదయం ఎమ్మెల్యే తన అనుచరులతో కలిసి విజయవాడ నుంచి హైదరాబాద్‌కు రోడ్డు మార్గంలో వెళుతుండగా మార్గంమధ్యలో సూర్యాపేట జిల్లా ఖాసీంపేట వద్ద జాతీయ రహదారిపై కాన్వాయ్‌లో ఒక వాహనం ప్రమాదానికి గురై పాక్షికంగా దెబ్బతింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదని శాసనసభ్యుని కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. అనంతరం మిగిలిన వాహనాలతో ఎమ్మెల్యే వంశీమోహన్ హైదరాబాద్ చేరుకున్నట్లు పేర్కొన్నారు.

దోమల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు



కంకిపాడు: దోమల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని గొడవర్రు సర్పంచ్ మేరుగు విజయ చంద్రశేఖర్ అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ, గ్రామ పంచాయతీ సంయుక్త భాగస్వామ్యంతో గ్రామంలో దోమల మందు ఫాగింగ్ పనులు శనివారం చేపట్టారు. పనులను గ్రామ సర్పంచ్ పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో దోమలు విజృంభించి సీజన్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. వ్యాధుల విజృంభణ నియంత్రణ చర్యలను తీసుకుంటున్నామని, ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని చెప్పారు. ఎంపీహెచ్‌ఎస్ బి.వెంకటేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ శ్రీధర్‌కుమార్, మణికాంత్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెనమలూరు: గోసాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు అవ్వటంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఎం.కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం గోసాల డొంకరోడ్డుకు చెందిన దగాని ఏసయ్య వ్యవసాయ పనులు చేస్తుంటాడు. అతను తన బైక్‌పై బయలుదేరి గోసాల సెంటర్ మసీదు వద్ద రోడ్డు దాటుతుండగా విజయవాడ నుంచి మచిలీపట్నం వెళ్తున్న ఆర్టీసీ బస్సు అతనిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో అపస్మారకస్థితికి చేరిన ఆయనను అత్యవసర చికిత్సకు విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. క్షతగాత్రుడని భార్య దగాని జ్యోతి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

బాలుడి అదృశ్యంపై కేసు నమోదు

పెనమలూరు: గంగూరులో బాలుడు అదృశ్యం అవ్వటంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గంగూరులో కార్పొరేట్ కాలేజీలో బండి దేవుళ్లు, అతని కుమారుడు బండి రాజు(15) పని చేస్తున్నారు. రాజు 8వ తరగతి వరకు చదివి మానేశాడు. అయితే ఈ నెల 8వ తేదీన బండి రాజు ఎవ్వరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయాడు. అతని సెల్ ఫోన్ స్విచ్‌ఆఫ్ చేశాడు. బాలుడి కోసం బంధువుల ఇళ్లల్లో, పలు ప్రాంతాల్లో వెతికారు. అయినా అతని ఆచూకీ తెలియక పోవటంతో తండ్రి దేవుళ్లు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

నాసా ప్రాజెక్ట్‌కు ఎంపికైన శ్రీచైతన్య విద్యార్థులు



గన్నవరం: స్థానిక కొత్తపేటలోని శ్రీచైతన్య స్కూల్‌కు చెందిన తొమ్మిది మంది విద్యార్థులు నాసా ప్రాజెక్ట్‌కు ఎంపికై నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ గాయత్రీదేవి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల నాసా ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి తమ పాఠశాల విద్యార్థులు ప్రాజెక్ట్‌లు పంపగా, వారిని నాసా ప్రాజెక్ట్‌కు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికై న విద్యార్థులను గోల్డ్ మెడల్స్, సర్టిఫికెట్లతో సత్కరించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులను ఏజీఎం మురళీకృష్ణ, ఆర్‌ఐ దేవేంద్ర, కోఆర్డినేటర్ భానుకృష్ణ, డీన్ శ్రీను అభినందించారని పేర్కొన్నారు.

రౌడీషీటర్లలో మార్పు రాకపోతే చర్యలు

పటమట(విజయవాడతూర్పు): రౌడీషీటర్లు ప్రవర్తన మార్చుకోపోతే పీడీ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని సెంట్రల్ ఏసీపీ భాస్కరరావు, పటమట సీఐ కాశీవిశ్వనాథ్ నేరస్తులను హెచ్చరించారు. శనివారం వీరిద్దరూ పటమట పీఎస్‌లో స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు, పెనమలూరు పరిధిలోని, సనత్‌నగర్ రౌడీషీటర్ కేటీఎం పండు ఇంటి వద్ద పండు కుటుంబ సభ్యులను కలిసి కౌన్సెలింగ్ ఇచ్చారు. అసాంఘిక పనులకు పాల్పడితే నగర బహిష్కరణ తప్పదని హెచ్చరించారు.

వైఎస్సార్ సీపీ మద్దతుదారుల విజయకేతనం

- విజేతలకు అభినందనల వెల్లువ
- సంబరాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు



కంకిపాడు ప్రధాన సెంటర్‌లో విజయోత్సవ సంబరాల్లో వైఎస్సార్ సీపీ శ్రేణులు



శ్రీనివాసరెడ్డికి ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఎంపీడీవో శేషగిరిరావు

కంకిపాడు: పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల్లో శనివారం జరిగిన సర్పంచ్ వార్డు సభ్యుల ఉప ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారులు విజయకేతనం ఎగురవేశారు. కంకిపాడు పంచాయతీ ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతు తెలిపిన అభ్యర్థి విజయం సాధించారు. త్రిముఖ పోటీలో అందరి అంచనాలను తలకిందులు చేస్తూ వైఎస్సార్ సీపీ బలపర్చిన అభ్యర్థి మలబంటి దుర్గాప్రసాద్ అలియాస్ చిన్నమ్ములు విజయాన్ని సొంతం చేసుకున్నారు. పంచాయతీ 9వ వార్డు ఉప ఎన్నిక ప్రక్రియ శనివారం నిర్వహించారు. స్థానిక ఎంపీపీ పాఠశాలలో పోలింగ్ ప్రక్రియ జరిగింది. 725 ఓట్లకు గానూ 554 ఓట్లు పోలయ్యాయి. వార్డుకు వైఎస్సార్ సీపీ మద్దతుతో మలబంటి దుర్గాప్రసాద్, టీడీపీ మద్దతుతో చలవాది రాజా, జనసేన, బీజేపీ సంయుక్త అభ్యర్థిగా పి.ప్రవీణ్‌కుమార్ పోటీలో నిలిచారు. మధ్యాహ్నం నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం కాగా వైఎస్సార్‌సీపీ బలపర్చిన దుర్గాప్రసాద్‌కు 205 ఓట్లు, జనసేన, బీజేపీ సంయుక్త అభ్యర్థి ప్రవీణ్‌కుమార్‌కు 181 ఓట్లు, టీడీపీ మద్దతు ఇచ్చిన చలవాది రాజాకు 159 ఓట్లు దక్కాయి. ఒక ఓటు నోటాకు, 8 ఓట్లు చెల్లలేదు. సమీప అభ్యర్థి ప్రవీణ్‌కుమార్‌పై దుర్గాప్రసాద్ 24 ఓట్ల మెజారిటీతో విజయాన్ని కైవసం చేసుకున్నారు. ఈ మేరకు ఎన్నికల అధికారి సీతారామరాజు, ఇన్‌చార్జి ఎంపీడీవో ఉదయ్‌భాస్కర్ ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు. అనంతరం దుర్గాప్రసాద్‌కు ధ్రువీకరణ పత్రం అందించారు. పోలింగ్ కేంద్రాన్ని జిల్లా అదనపు ఎస్పీ ఆర్. శ్రీహరిబాబు సందర్శించారు. పోలింగ్ ఏర్పాట్లు, ఫలితాల అనంతరం తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు ఇచ్చారు. పరిశీలనలో డీఎస్పీ జయసూర్య, సీఐ వాసంశెట్టి శ్రీనివాసరావు, అదనపు ఎస్ఐ లక్ష్మి పాల్గొన్నారు.

కంకిపాడులో సంబరాలు

పార్టీ బలపర్చిన అభ్యర్థి విజయం సాధించటంతో వైఎస్సార్ సీపీలో నూతనోత్సాహం నెలకొంది. ప్రధాన సెంటరులో బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. పోలీస్ స్టేషన్ నుంచి అంకమ్మతల్లి గుడి సెంటరు వరకూ పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు భారీ ఊరేగింపు నిర్వహించారు. జయహో జగన్, జై సారథి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దుర్గాప్రసాద్‌ను పూలమాలలతో సత్కరించి, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు బాకీబాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు, జేసీఎస్ చైర్మన్ రాచూరి చిరంజీవి, అగ్రిబోర్డు చైర్మన్ చాట్ల విజయ్‌బాబు, మాజీ చైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు, దుర్గగుడి బోర్డు మాజీ సభ్యుడు నెరుసు సతీష్, వైస్ ఎంపీపీ ధూళిపూడి కృష్ణకిషోర్, ఎంపీటీసీలు కోనా కిషోర్, చిట్టూరి ప్రసాద్, సీహెచ్‌సీ చైర్మన్ మేదండ్రావు కుటుంబరావు, నాయకులు తంబాబత్తుల ఓంకారం, కొప్పరాజు సురేష్, యువకులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలంలోని ఐదు గ్రామ పంచాయతీల్లో జరిగిన వార్డు సభ్యుల ఉప ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. వీరవల్లి, అంపాపురం, ఎ.సీతారామపురం, ఓగిరాలలో వార్డు సభ్యులు ఏకగ్రీవంగా గెలుపొందగా, మల్లవల్లి గ్రామ పంచాయతీ 6వ వార్డుకు ఇద్దరు అభ్యర్థులు పోటీ పడటంతో శనివారం పోలింగ్ నిర్వహించారు. మొత్తం 296 మంది ఓటర్లకు గానూ 229 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని జిల్లా అడిషనల్ ఎస్పీ ఆర్. శ్రీహరిబాబు సందర్శించారు. మల్లవల్లి 6వ వార్డు సభ్యుడు, ఉప సర్పంచ్ వణుకూరి నాగరాజు ఏడాదిన్నర క్రితం ఆకస్మికంగా మరణించటంతో ఆ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ ఎన్నికల్లో అనూహ్యంగా నాగరాజు సతీమణి వణుకూరి బుజ్జమ్మపై వైఎస్సార్ సీపీ మద్దతుదారుడు పంతం ప్రకాశం 53 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. రిటర్నింగ్ అధికారి కె.వెంకట ప్రసాదరావు ఎన్నిక ధ్రువీకరణ పత్రాన్ని పంతం ప్రకాశంకు అందించారు. వీరవల్లి గ్రామ పంచాయతీ 11వ వార్డుకు మోర్ల శివమ్మ, అంపాపురం గ్రామ పంచాయతీ 7వ వార్డుకు లంక గణపతిరావు, ఎ.సీతారామపురం 6వ వార్డుకు పంచకర్ల సునీత, ఓగిరాల పంచాయతీ 2వ వార్డుకు కగ్గా అంతర్వేదమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

తేలప్రోలు 4వ వార్డు సభ్యుడిగా వింతా గెలుపు

ఉంగుటూరు: మండలంలో తేలప్రోలు గ్రామ పంచాయతీ 4వ వార్డుకు జరిగిన ఎన్నికలో వైఎస్సార్ సీపీ బలపర్చిన వింతా శ్రీనివాసరెడ్డి తన ప్రత్యర్థి, టీడీపీ బలపరిచిన గులిపల్లి సందీప్‌పై 74 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 4వ వార్డులో మొత్తం 492 ఓట్లు ఉండగా 383 ఓట్లు పోలయ్యాయి. శ్రీనివాసరెడ్డికి 225 ఓట్లు, సందీప్‌కు 151 ఓట్లు, నోటాకు నాలుగు ఓట్లు, చెల్లనివి మూడు ఓట్లు పడ్డాయని ఎంపీడీవో శేషగిరిరావు వివరించారు. వార్డు సభ్యునిగా ఎన్నికైన శ్రీనివాసరెడ్డికి ఎంపీడీఓ ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. అనంతరం వైఎస్సార్ సీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు వాసురెడ్డి, తియ్యగూర గోవర్ధన్‌రెడ్డి, పలువురు పార్టీ నాయకులు శ్రీనివాసరెడ్డిని అభినందించారు.

నున్న 9వ వార్డులో వెంకటశివ విజయం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామ పంచాయతీ 9వ వార్డుకు శనివారం జరిగిన ఉప ఎన్నికల్లో వల్లూరు వెంకట శివ, సమీప అభ్యర్థి బొమ్మిన శ్రీనివాసరావుపై 25 ఓట్ల మెజార్టీతో గెలుపొందినట్లు రిటర్నింగ్ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు ప్రకటించారు. వార్డులో మొత్తం 828 ఓట్లు వుండగా వాటిలో 645 ఓట్లు పోలయ్యాయి. గౌను గుర్తుపై పోటీ చేసిన వల్లూరు వెంకటశివకు 331 ఓట్లు రాగా, కుక్కర్ గుర్తుపై పోటీ చేసిన బొమ్మిన శ్రీనివాసరావుకు 306 ఓట్లు వచ్చాయని, 7 ఓట్లు చెల్లనివి కాగా ఒక ఓటు నోటాకు వచ్చినట్లు రిటర్నింగ్ అధికారి శ్రీనివాసరావు తెలియజేశారు. గ్రామంలో ఉదయం 7 గంటల నుంచి ప్రారంభమైన ఉప ఎన్నిక ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది. నగర డెప్యూటీ పోలీస్ కమిషనర్ ఎం.సత్తిబాబు(అడ్మినిస్ట్రేషన్), నార్త్ ఏసీపీ సీహెచ్ రవికాంత్ శాంతి భద్రతలను పర్యవేక్షించారు.

మూడు గ్రామాల్లో ఏకగ్రీవం

గన్నవరంరూరల్: మండలంలోని మూడు గ్రామ పంచాయతీలకు వార్డు సభ్యుల ఎన్నిక ఏకగ్రీవం అయినట్లు ఎంపీడీఓ ఇ.సత్యకుమార్ తెలిపారు. ముస్తాబాదలో ఒకటవ వార్డు సభ్యురాలిగా ధనకొండ అంజలి, కొండపావులూరులో 6వ వార్డు సభ్యురాలిగా కూచిపూడి జ్ఞానసుందరం, చిన అవుటపల్లిలో 6వ వార్డు సభ్యుడిగా కటికల సుబ్బారావు ఏకగ్రీవంగా గెలుపొందినట్లు వివరించారు.

గండిగుంట ఉప ఎన్నిక ప్రశాంతం

ఉయ్యూరు: మండలంలోని గండిగుంట పంచాయతీ 10వ వార్డు స్థానానికి జరిగిన ఉప ఎన్నిక ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఎంపీపీ పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో 394 మంది ఓటర్లు ఉండగా 271 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మధ్యాహ్నం 2 గంటల తరువాత ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టారు. వైఎస్సార్ సీపీ బలపర్చిన అభ్యర్థి మోర్ల యోగేశ్వరరావుపై టీడీపీ బలపర్చిన అభ్యర్థి వీరంకి పాండురంగారావు 31 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. రంగారావుకు ఎంపీడీవో విమాదేవి ఎన్నికల ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గన్నవరంరూరల్: మండలంలోని వీరపనేనిగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ మెయింటినెన్స్ పనుల నిమిత్తం ఆదివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.హరిబాబు తెలిపారు. వీరపనేనిగూడెం, తెంపల్లి, బల్లిపర్రు, మెట్లపల్లి, కంద్రిక, కొత్తగూడెం, చింతగుంట, చిక్కవరం, బీబీగూడెం, గొల్లనపల్లి ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు, గృహ, వ్యాపార, వ్యవసాయ, పరిశ్రమల వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

కానూరులో..

పెనమలూరు: కానూరులోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డీఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. ఆయన శనివారం వివరాలు తెలుపుతూ మురళీనగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. జేఆర్డీ టాటా ఎస్టేట్, నవతా రోడ్డు, సిమెంట్ గోడౌన్ రోడ్డు, బల్లెంవారి వీధి, మసీదు రోడ్డులో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారున.

పేకాడుతున్న 10 మంది వ్యక్తుల అరెస్ట్

పెనమలూరు: కానూరు వందడుగుల రోడ్డులో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న 10 మంది వ్యక్తులపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పెనమలూరు ఎస్ఐ అర్జున్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం కానూరు వందడుగుల రోడ్డులో అలంకార్ బార్ వెనుక ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో మెరుపు దాడి చేశామన్నారు. ఈ దాడిలో 10 మంది వ్యక్తులు పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి రూ.48 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. మూడు కార్లు, ఇక బైక్, 11 సెల్‌ఫోన్లు సీజ్ చేశారు. నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. బార్‌లో క్యాషియర్‌గా ఉన్న రమేష్‌రెడ్డి అనే వ్యక్తి పేకాట నిర్వహిస్తున్నాడని ఎస్ఐ అర్జున్‌రాజు తెలిపారు. చట్టవ్యతిరేక పనులు నిర్వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు.

రైతుల సంక్షేమమే కేడీసీసీ బ్యాంక్ లక్ష్యం



బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న కేడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి

ఉయ్యూరు: రైతుల సంక్షేమమే లక్ష్యంగా కేడీసీసీ బ్యాంక్ సేవలు విస్తృతంగా అందిస్తున్నామని ఆ బ్యాంక్ జిల్లా చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి అన్నారు. మండలంలోని కాటూరు గ్రామంలో రూ.1.46 కోట్ల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన కేడీసీసీ బ్రాంచ్ కార్యాలయాన్ని శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో చైర్మన్ తాతినేని పద్మావతి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నూతన సంస్కరణలతో అన్నదాతలు ఆర్థిక పరిపుష్టి సాధిస్తున్నారన్నారు. కేడీసీసీ బ్యాంక్, కో ఆపరేటివ్ సొసైటీలు రైతులకు మరింత చేరువ చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. రైతులు, మహిళలకు అవసరమైన రుణాలను మంజూరు చేసి దేశంలోనే ఉత్తమ బ్యాంకుగా ఖ్యాతి గడించామన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ సీఈఓ శ్యామనోహర్, జిల్లా బ్యాంక్ డైరెక్టర్ పడమట సుజాత, పెద వెంకయ్య, ఏజీఎం రంగయ్య, సొసైటీ చైర్మన్ గొట్టం శ్రీనివాసరావు, బ్రాంచ్ మేనేజర్ ఈడే శ్రీకాంత్, ఎంపీటీసీ తోట శ్రీలక్ష్మి, ఏఎంసీ వైస్ చైర్మన్ దాసే రవి, నాయకులు కొలుసు పోతురాజు, ఆరేపల్లి రజిని పాల్గొన్నారు.

మానవ జీవితంలో సైన్స్‌కు ప్రాధాన్యం



సిద్ధార్థ ఆదర్శలో సైన్స్ ఎగ్జిబిషన్ తిలకిస్తున్న సీఎస్‌ఈ హెచ్‌వోడీ రాజేశ్వరరావు తదితరులు



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ రాజేంద్ర

పెనమలూరు: మానవ జీవితంలో సైన్స్‌కు అత్యంత ప్రాధాన్యం ఉందని వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ డి.రాజేశ్వరరావు అన్నారు. కానూరు సిద్ధార్థ ఆదర్శ రెసిడెన్షియల్ పాఠశాలలో శనివారం విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవ జీవితంలో ప్రతి అంశంలో సైన్స్ చాలా శక్తివంతమైందన్నారు. సమాజంలో మనం చేసే ప్రతీ పనికి విజ్ఞాన శాస్త్ర, సాంకేతికతల ఫలితమేనని తెలిపారు. విశ్వంలో రహస్యాలను తెలుసుకోవటానికి సైన్స్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సైన్స్ లేకపోతే ఇంజినీరింగ్, టెక్నాలజీ లేదన్నారు. పాఠశాల కన్వీనర్ వీరపనేని శశికళ మాట్లాడుతూ.. నేటి ఆధునిక యుగంలో విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులు తమ నైపుణ్యం పెంచుకోవటానికి దోహదపడతాయని తెలిపారు. ఈ ప్రదర్శనలో 300 మంది విద్యార్థులు 10 మోడల్స్ ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మనోజ్ కర్మాకర్, వైస్ ప్రిన్సిపాల్ సాయికృష్ణ, విద్యార్థుల తల్లితండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేయాలి

రామవరప్పాడు: ఫార్మసీ రంగ విద్యార్థులు మానవాళికి ఉపయోగపడేలా నూతన ఆవిష్కరణలు చేయాలని బెంగళూరు నుంచి వచ్చిన డాక్టర్ ఎస్‌వీ రాజేంద్ర అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని విజయ మహిళా ఫార్మసీ కళాశాలలో శనివారం అసోసియేషన్ ఆఫ్ ఫార్మసీ ప్రొఫెషనల్స్ ఆంధ్రప్రదేశ్ శాఖ, అసోసియేషన్ ఆఫ్ ఫార్మసీ ప్రొఫెషనల్ అంతర్జాతీయ శాఖ, అనల్ కేం డివిజన్ సంయుక్త ఆధ్వర్యంలో మానవతా దినోత్సవం సందర్భంగా గ్లోబల్ ఆస్పెక్ట్స్, ప్రెజెంట్ సినారియో ఆఫ్ ఫార్మసీ అండ్ ఫార్మస్యూటికల్ సైన్సెస్ అంశంపై మొదటి ఇండో కెనడియన్ అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఒడిశా నుంచి హాజరైన డాక్టర్ సునీత్ కుమార్ సాహు మాట్లాడుతూ నూతన మూలకాలను కనుగొన్న తర్వాత వాటి పరిమాణాన్ని వీలైనంత సూక్ష్మస్థాయిలోకి తీసుకురావటం వల్ల తక్కువ మోతాదులో వ్యాధులను నివారించడానికి ఉపయోగపడుతుందని, అలాగే విషపూరిత లక్షణాలను నివారించవచ్చన్నారు. అనంతరం అత్యుత్తమ శాస్త్రీయ ప్రదర్శనలు ఇచ్చిన విద్యార్థినులకు జ్ఞాపికలు, నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా డాక్టర్ సురేష్ చెన్నుపాటి, కళాశాల ప్రిన్సిపాల్ కె.పద్మలత, అధ్యాపకులు పాల్గొన్నారు.

పటిష్టంగా డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు అమలు

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ గీతాబాయి



కుందేరులో సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ గీతాబాయి

కంకిపాడు: డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ గీతాబాయి అన్నారు. మండలంలోని కుందేరు గ్రామంలో చేపట్టిన డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. శిబిరాన్ని డాక్టర్ గీతాబాయి ఆకస్మికంగా సందర్శించారు. వైద్య సేవలు అందుతున్న తీరుపై వృద్ధులను అడిగి తెలుసుకున్నారు. వైద్యసేవలు సమర్థంగా అందుతున్నట్లు వృద్ధులు చెప్పటంతో సంతృప్తి వ్యక్తపరిచారు. డాక్టర్ గీతాబాయి మాట్లాడుతూ.. వృద్ధుల కంటి సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించే లక్ష్యంతో ఉన్నత ప్రమాణాలతో కూడిన వైద్యసేవలను గ్రామీణ ప్రాంతాలకు చేరవేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఉప్పలూరు పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ వి.వి.రాజేష్‌కుమార్ 120 మంది వృద్ధులకు కంటి పరీక్షలు చేసి మందులు అందించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో మోహన రూపా, ఆశ కార్యకర్తలు శారద, సిపోరి పాల్గొన్నారు.

రామవరప్పాడులో అభివృద్ధి పరుగులు

- రూ.4 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు
- అంతర్గత రహదారులు సీసీ రోడ్లుగా రూపాంతరం
- తుదిదశలో సచివాలయాలు, హెల్త్‌సెంటర్, ఆర్బీకే సెంటర్ల నిర్మాణాలు
- రూ.50 లక్షల వ్యయంతో దాత సహాయంతో కర్మల భవనం నిర్మాణం



తుదిదశలో సచివాలయ భవన నిర్మాణం



సువిశాలంగా అభివృద్ధిపరిచిన ఎస్‌బీఐ రహదారి

రామవరప్పాడు: నగరానికి కూతవేటు దూరంలో ఉన్న మేజర్ పంచాయతీ రామవరప్పాడు. ఈ గ్రామంలో సుమారు 40వేల మంది జనాభా నివసిస్తున్నారు. నగరానికి ఆనుకుని ఉన్న ఈ గ్రామంలో స్థిర నివాసం ఏర్పరచుకుని వలస వచ్చే వారి సంఖ్య కూడా ఎక్కువగానే ఉంది. ఇంతటి ప్రాధాన్యత సంతరించుకున్న ఈ మేజర్ పంచాయతీ గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఆశించినంతగా అభివృద్ధి పనులు జరగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ రూపురేఖలు మారిపోయాయి. గ్రామంలో 80 శాతంకు పైగా సిమెంట్ రహదారులు, డ్రెయిన్ల అభివృద్ధి పనులను పూర్తి చేశారు. అభివృద్ధి ఎరుగని కాల్వగట్టు ప్రాంతాల్లో కూడా అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయి.

రూ.4 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ప్రత్యేక చొరవ తీసుకుని నిధులు కేటాయించడంతో గ్రామాలు అభివృద్ధి బాట పడుతున్నాయి. రామవరప్పాడులో రూ.1.70 కోట్లతో నాలుగు సచివాలయాలు, రూ.63 లక్షలతో 3 హెల్త్ సెంటర్లు, రూ.17 లక్షలతో ఆర్బీకే సెంటర్ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. పంచాయతీ, మండల నిధులతో ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోని అంతర్గత రహదారులు, డ్రెయిన్లకు మోక్షం లభించింది. ప్రధానంగా గ్రామంలోని ఎస్‌బీఐ రహదారి రూ.12 లక్షలు, ఆక్స్‌ఫర్డ్ స్కూల్ రోడ్డు, డ్రెయిన్‌ను రూ.35 లక్షలతో సువిశాలంగా అభివృద్ధి చేశారు. కాల్వగట్టు ప్రాంతం పటేల్ నగర్‌లో రూ.39 లక్షలతో రహదారి, సీసీ డ్రెయిన్ అభివృద్ధి చేశారు. గ్రామంలో పలుచోట్ల మోటారు బోర్లను ఏర్పాటు చేశారు. ఇవి కాక జలజీవన్ మిషన్ ద్వారా గ్రామంలో 4 వాటర్ ట్యాంక్‌లు, గ్రామం మొత్తం వాటర్ పైప్‌లైన్ల ఏర్పాటుకు రూ.4కోట్లు నిధులు మంజూరయ్యాయి. అయితే గ్రామ పంచాయతీ మ్యాచింగ్ గ్రాంటు కింద రూ.40 లక్షలు కట్టవలసి ఉంది. త్వరలో పంచాయతీ గ్రాంటు సొమ్ము కట్టి రూ.4 కోట్లు విడుదల చేయించి పనులు ప్రారంభిస్తామని సర్పంచ్ తెలిపారు.

రూ.50 లక్షల వ్యయంతో కర్మల భవనం

గ్రామంలో కర్మల భవనం లేక గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులు గురించి తెలుసుకున్న దాత భవన నిర్మాణానికి ముందుకొచ్చారు. గ్రామానికి చెందిన కోడెబోయిన రాధాకృష్ణ జ్ఞాపకార్థం వారి కుమారుడు కోడెబోయిన శ్రీనివాసకృష్ణ రూ.50 లక్షలు వెచ్చించి కర్మల భవనం నిర్మిస్తున్నారు. గ్రామంలోని కొత్త వంతెన సమీపంలో సుమారు 12 సెంట్ల విస్తీర్ణంలో సకల హంగులతో ఈ భవనాన్ని నిర్మిస్తున్నారు. హాలు, భోజనశాల, మరుగుదొడ్లు, పిండ ప్రదానం నిర్వహించుకునేందుకు వీలుగా సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఈ నిర్మాణ పనులు కూడా దాదాపు పూర్తికావచ్చాయి. కాల్వగట్టు ప్రాంతం పీఎస్‌ఆర్ కాలనీలో హిందూ శ్మశానవాటికను పంచాయతీ, మండల నిధులతో అభివృద్ధి చేస్తున్నారు. వైకుంఠరథం, విశ్రాంతి భవనం, దహనవాటిక భవనం, హాలు తదితర ఆధునిక సౌకర్యాలతో అతిత్వరలో అందుబాటులోకి రానుంది.

మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దుతున్నాం



గ్రామంలో ఏ ప్రభుత్వంలో జరగనటువంటి అభివృద్ధి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరుగుతోంది. గ్రామాభివృద్ధికి గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ నిధుల మంజూరుకు కృషి చేశారు. సుమారు రూ.4 కోట్లతో అభివృద్ధి పనులను పూర్తి చేస్తున్నాం. దశాబ్దాల క్రితం నిర్మించిన పంచాయతీ కార్యాలయాన్ని రీ మోడలింగ్ చేసి ముస్తాబు చేశాం. గ్రామంలో గ్రంథాలయం, కాపు, బీసీ కల్యాణ మండపాలు, సబ్ స్టేషన్ నిర్మాణానికి అంచనాలు రూపొందిస్తున్నాం. వీటికి స్థలాలు సేకరించి తదుపరి చర్యలు తీసుకుంటాం.

– వరి శ్రీదేవి, సర్పంచ్, రామవరప్పాడు

ప్లాస్టిక్ నివారణతో పర్యావరణ పరిరక్షణ



పెనమలూరు: పరిసరాల పరిశుభ్రతకు ప్లాస్టిక్ వస్తువులు నివారించాలని కళాకారుడు ఎ.శేఖర్‌బాబు బృందం తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం గోసాల, గంగూరు గ్రామ పంచాయతీలో సింగిల్‌యూజ్డ్ ప్లాసిక్ నివారణ, నగదు రహిత చెల్లింపులపై కళాకారులు కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు జాతాలో వివరాలు తెలుపుతూ ప్లాస్టిక్ వాడకం వలన మనిషి ఉనికిని మనిషే ప్రమాదకర స్థాయికి తీసుకువెళ్తున్నాడన్నారు. స్వచ్ఛ సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపును గ్రామాల్లో ప్రతి ఒక్కరూ మద్దతు తెలిపాలని కోరారు. పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వామ్యం కావాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీల్లో ప్రవేశపెట్టిన నగదురహిత చెల్లింపులపై ప్రజలు అవగాహన పొందాలని కోరారు. నగదు రహిత చెల్లింపులతోనే అవినీతిని నిర్మూలించగలుగుతామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సంగెపు శ్రీనివాసరావు, ఈవో ప్రసాద్, కళాకారులు ఎం.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ పార్కు పరిశీలన

పటమట(విజయవాడతూర్పు): నగరానికి మరో ఆకర్షణీయమైన ఉద్యానవనం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ పార్క్ అని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ అన్నారు. ఆయన నగర పర్యటనలో భాగంగా శనివారం ఈ పార్కును సందర్శించి మరింతగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. ఆయన పార్క్ ఆవరణలో కొత్తగా నిర్మించిన సైకిల్ ట్రాక్‌పై ట్రయల్‌రన్‌ను పరిశీలించారు. పర్యటనలో అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి, సూపరింటెండింగ్ ఇంజినీర్ (ప్రాజెక్ట్స్) కె. రామమోహనరావు, ఏడీహెచ్ శ్రీనివాస్, ఎస్‌ఎఫ్‌వో వెంకటేశ్వరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు

700 మందికి శ్రీవారి అన్నప్రసాదం

విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యాన పున్నమ్మతోటలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం ప్రాగణంలో శనివారం 700 మంది శ్రీవారి అన్నప్రసాదం స్వీకరించారు. దాత శ్రీకాకుళపు శ్రీనివాసరావు, వీరరాఘవమ్మ సహకారంతో స్వామి వారికి మహానివేదన సమర్పించి అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. శ్రీ వేంకటేశ్వర స్వామికి శనివారంతో కూడిన శ్రావణ మాసం కావడంతో శ్రీ వారికి ప్రత్యేక పూజలు సహస్రనామార్చన చేశారు. కంచికామకోటి పీఠపాలితక శారదా చంద్రమౌళీశ్వర స్వామి, శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.